క్లుప్తంగా

ప్రేమికుల రోజు మన సంస్కృతి కాదు



గోపూజలో పాల్గొన్న ట్రస్టుబోర్డు సభ్యుడు రాములు

తిరుపతి కల్చరల్: గో సేవ గోవిందుని సేవతో సమానమని టీటీడీ పాలక మండలి సభ్యుడు మొరంశెట్టి రాములు అన్నారు. గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్ సహకారంతో సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో వేలంటైన్స్ డే వద్దు..గోపూజే ముద్దు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాములు విద్యార్థులతో కలిసి గో పూజ నిర్వహించి దాణాను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రేమికుల రోజు జరుపుకోవడం మన సంస్కృతి కాదన్నారు. పాఠశాల అధినేత్రి మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం గోశాలలో

రాష్ట్రీయ గో సేవా సంఘ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంలోని గోశాలలో గోవు అలింగన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవులకు చెరుకులు, పండ్లు దాణాగా తినిపించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జనార్దన్, శ్రీరామ సేన ఉపాధ్యక్షుడు జి.నాదముని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు, టి.మాధవయ్య పాల్గొన్నారు.

పంటలకు ఈకేవైసీ తప్పనిసరి

ఎర్రావారిపాళెం: రైతులు సాగు చేస్తున్న పంటలకు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయఅధికారి ఖాదర్‌బాషా మంగళవారం తెలిపారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఆర్‌బీకే సెంటర్‌లో ఈకేవైసీ కూడా చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ 13వ విడత నగదు ఈనెల 24వ తేదీ జమ కానున్న నేపథ్యంలో తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకుని ఆధార్‌తో బ్యాంకు ఖాతాను లింక్ చేయించుకోవాలని సూచించారు.

సురేష్‌రెడ్డి మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: వైఎస్సార్‌సీపీకి ఎనలేని సేవలను అందించిన సురేష్ రెడ్డి అకాల మరణం పార్టీకి తీరనిలోటని తిరుపతి రూరల్ ఎంపీపీ మోహిత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సైనికుడు పాశం సురేష్ రెడ్డి(32) మృతదేహానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి నివాళులు అర్పించారు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన సురేష్ రెడ్డి మృతదేహానికి మండల పరిధిలోని కందులవారిపల్లె మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. చెవిరెడ్డి మోహిత్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు నివాళులు అర్పించారు. పార్టీ తరపున ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మోహిత్ రెడి భరోసా ఇచ్చారు. నాయకులు పాశం శ్రీనివాసులు రెడ్డి, మస్తాన్, పసల నాగరాజు, మధు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న డాలర్స్ దివాకర్ రెడ్డి, గేహిని రెడ్డి

తిరుపతి తుడా : డాలర్స్ గ్రూప్ చైర్మన్ దివాకర్‌రెడ్డి కుమార్తె గేహిణి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా యాత్రికులు, పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తిరుపతి శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్ద మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి అన్నదానం చేశారు. అంతకు ముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లేపల్లి మధుసూదన్ రెడ్డి, ఆడిటర్ వెంకటేష్ రెడ్డి, వంశీకృష్ణ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బుడమల దామోదర్ రెడ్డి, డాలర్స్ గ్రూప్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో దివ్యాంగ ఉద్యోగుల ప్రతిభ

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీల్లో మంగళవారం జరిగిన వివిధ విభాగాల్లో దివ్యాంగులు ప్రతిభ చాటారు. దివ్యాంగ ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో భాస్కర్ విజయం సాధించగా, సత్యం రన్నరప్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సంతానం, రెడ్డప్ప విజయం సాధించగా, రవికుమార్, సత్యం రెండో స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ప్రియాంక విజయం సాధించగా, ఎస్.తులసమ్మ రన్నరప్‌గా నిలిచారు. టేబు ల్ టెన్నిస్ డబుల్స్ పోటీల్లో బి.అరుణ కుమారి, టి.గంగోజమ్మ విన్నర్స్ కాగా, కె.విజయలక్ష్మి, టిఎస్ ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచారు. 45 ఏళ్ల పైబడిన మహిళల బ్లాంకెట్ వాలీబాల్ పోటీల్లో జి.దామరసెల్వి జట్టు విన్నర్స్ కాగా, కె.ఇందిర జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్లలోపు మహిళల బ్లాంకెట్ వాలీ బాల్ పోటీల్లో టి.గంగాదేవి జట్టు విజయం సాధించగా, మనోజ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విశ్రాంత మహిళా ఉద్యోగుల టెన్నికాయిట్ డబుల్స్‌లో బి.లలితమ్మ, డి.భారతి విజేతలు కాగా, భారతి, మీనా కుమారి రన్నర్స్‌గా నిలిచారు.

సర్వభూపాలునిపై సర్వాంతర్యామి



కల్పవృక్ష వాహనంపై స్వామివారి ఊరేగింపు



సర్వభూపాల వాహనంపై స్వామి,అమ్మవార్లు



గరుడసేవలో అలంకరించనున్న లక్ష్మీహారం(ఫైల్)

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజు మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ముందు వృషభ, అశ్వ, గజరాజులు ఠీవీగా నడుస్తుండగా, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు సాగుతుండగా వాహన సేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు చంద్రకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై శ్రీరాజమన్నార్ అలంకరణలో స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు నీరాజనాలు సమర్పించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నయనానందకరంగా సాగింది. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, ఏవీఎస్ఓ విశ్వనాథం, వీఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు గరుడ సేవ జరుగనుంది. తనకు అత్యంత ఇష్టమైన గరుడిడిని వాహనంగా చేసుకుని స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం పల్లకీ ఉత్సవం జరుగనుంది, గరుడ సేవ ఏర్పాట్లను ఆలయ అధికారుల పూర్తిచేశారు.

నేడు శ్రీవారి లక్ష్మీహారం శోభాయాత్ర

బ్రహ్మోత్సవాలల్లో భాగంగా బుధవారం జరుగనున్న గరుడ సేవకు శ్రీవారి లక్ష్మీహారాన్ని అలంకరించనున్నారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి బుధవారం మధ్యాహ్నం శోభాయాత్ర ప్రారంభమవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుపతి పరిపాలన భవనం నుంచి శోభాయాత్ర ప్రారంభమై ప్రధాన కూడళ్ల మీదుగా శ్రీనివాస మంగాపురం చేరుకుంటుందని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు గోవిదరాజస్వామి వారి ఆలయం నుంచి శ్రీఆండాళ్ అమ్మవారి పూలమాలలు ఊరేగింపుగా శ్రీనివాస మంగాపురానికి తీసుకురానున్నారు.

వైభవం..రామలింగ చాముండేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ





గర్భగుడి గోపుర కలశ ప్రతిష్ఠ, (ఇన్‌సెట్) ఆలయంలో పూజలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలో నూతనంగా నిర్మించిన శ్రీరామలింగ చాముండేశ్వరిదేవి ఆలయ కుంభాభిషేకం వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రామలింగ చాముండేశ్వరిదేవి అమ్మవారు, గణపతిస్వామి, సుబ్రమణ్యస్వామి, మహాలక్ష్మి, సరస్వతి దేవి, పార్వతీదేవి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గర్భగుడి గోపుర కలశ స్థాపన, 108 కలశాలకు పూజలు జరిగాయి. అనంతరం నవగ్రహశాంతి, ప్రధాన దేవతారాధన, 108 కలశాలకు ఆరాధన, మృత్యుంజయ హోమం, లఘు పూర్ణాహుతి వంటి వైదిక కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నవదుర్గ చండికా పారాయణం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పట్టువస్త్రాలను సమర్పించనున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ఆలయాన్ని దర్శించనున్నారు. మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు పన్నెంవాసు, శ్రీకాంత్, శేఖర్ తెలిపారు.

శేష వాహనంపై సదాశివుని కటాక్షం



శేష వాహనంపై విహారం



మకర వాహనంపై స్వామి, అమ్మవార్లు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం రాత్రి శేష వాహనంపై, ఉదయం సోమస్కందమూర్తి కామాక్షి అమ్మవారి సమేతుడై మకర వాహనంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఆలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీసోమస్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో వేదోక్తంగా అభిషేకం చేశారు. కాగా రాత్రి 8 నుంచి 10 గంటల వరకు శేష వాహన సేవ అత్యంత వైభవంగా సాగింది. మంగళవా యిద్యాలు, కళాకారుల భజన సంకీర్తన ప్రదర్శనల ముందు సాగుతుండగా వాహన సేవలు కోలాహలంగా సాగాయి. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పూత దశలో మందులు పిచికారీ చేయెద్దు



సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి శైలజ

చంద్రగిరి: మామిడిలో పూత విచ్చుకున్న దశలో అనవసరంగా పురుగు, తెగుళ్ల మందులు పిచికారీ చేయకూడదని మండల ఉద్యానశాఖ అధికారి శైలజ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నడింపల్లి పంచాయతీలో తోటబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత ప్రస్తుతం 60శాతం విచ్చుకుని ఉందని, కొంత భాగం ఇగుర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. బూడిద, తేనె మంచు పురుగు ఉధృతిగా ఉన్నప్పుడు మాత్రమే పూత విచ్చుకున్న దశలో హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లు, ఇమిడా క్లోప్రిడ్-0.3మిల్లీలీటర్లు, ప్లానోఫిక్స్-0.2 మిల్లీలీటర్లు, బోరాన్-గ్రాము, జిగురు లేదా బంక-0.5మిల్లీలీటర్లను లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. నల్లపూత దశలో పిందె బఠానీ పరిమాణంలో ఉన్నప్పుడు ఎసిఫేట్–1.5 గ్రాములు, మాంకోజబ్–2గ్రాములు, ప్లానోఫిక్స్–0.2మిల్లీగ్రాములు, జిగురు–0.5 మిల్లీలీటర్లను లీటరు నీటితో కలపి చెట్టు, కొమ్మలు బాగా తడిసేలా పిచికారీ చేయాలని తెలిపారు. మామిడి పిందెలు బఠాని నుంచి నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు తేలికపాటి నీటి తడి ఇవ్వడం ద్వారా పిందె రాలడాన్ని నివారించవచ్చునని లేదా పొటాషియం నైట్రేట్–10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసి పిందెరాలడం ఆగిపోతుందని సూచించారు. చంద్రగిరి, పాకాల మండల ఉద్యానశాఖ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం





రామచంద్రాపురంలో.., సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి శశికళ

భాకరాపేట: నిత్యం సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్య సమస్యలు దరిచేరవని భాకరాపేట పీహెచ్‌సీ వైద్యాధికారి శశికళ అన్నారు. మంగళవారం సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భాకరాపేటలో విద్యార్థులతో కలసి సైక్లింగ్ మారథాన్ ప్రారంభించారు. బరువు, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి సైకిలింగ్ ఉపయోగపడుతుందన్నారు. వైద్యాధికారి తేజస్విని, సీహెచ్‌వో శేషుకుమారి, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఆయుష్ ఫార్మసిస్ట్ షఫీ, ఆశా వర్కర్లు హంస, చిట్టమ్మ, పద్మ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మెరుగైన ఆరోగ్యానికి శారీరక శ్రమ అవసరమని, ఇందుకు సైక్లింగ్ సరైన మార్గమని కమ్మపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని సీరామాపురం, సొరకాయలపాలెం, గంగిరెడ్డిపల్లి, కేకేసీపురం, నడవలూరు, నెన్నూరు గ్రామ సచివాలయాల్లో సైక్లింగ్ మారథాన్ నిర్వహించారు. విద్యార్థులతో కలసి ఆమె సైక్లింగ్ చేశారు. అనంతరం సైకిల్ తొక్కడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు తిరుచ్చి బహూకరణ



తిరుచ్చిని అధికారులకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర సామివారికి తమిళనాడులోని తిరుచ్చికి చెందిన రామ్‌కుమార్ బాలకృష్ణన్, తిరుపతికి చెందిన గీతలక్ష్మి, శ్రీహృదయ్ అనే భక్తులు కలసి మంగళవారం రాత్రి సుమారు రూ.10లక్షల విలువ చేసే తిరుచ్చిని ఆలయానికి బహూకరించారు. ఆలయ అర్చకులు తిరుచ్చికి శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వచనం ఇప్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ ఉద్యోగులకు క్రికెట్ పోటీలు ప్రారంభం

తిరుపతి అలిపిరి: ఎస్వీ హైస్కూల్ మైదానంలో మంగళవారం టీటీడీ ఉద్యోగుల క్రికెట్ పోటీలను జేఈఓ సదాభార్గవి ప్రారంభించారు. జేఈఓ మాట్లాడుతూ ఉద్యోగులు కోరిన వెంటనే మైదానం అభివృద్ధికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి రూ.84లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. రిక్రియేషన్ హాల్లో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ ఆడేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 6నెలల్లో ఇతర క్రీడా పరికరాలను సమకూర్చనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టీటీడీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఈఓ స్నేహలత, ఈఈ మురళి పాల్గొన్నారు.

మంత్రులను విమర్శించే స్థాయి లేదు

తిరుపతి కల్చరల్: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని విమర్శించే అర్హత నారా లోకేష్‌కు లేదని వడమాలపేట జె డ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడీ నెల్లూరు నియోజవర్గ పాదయాత్రలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని లోకేష్ అనడం అర్థరహితమన్నారు. పాదయాత్రలో ఆయనకు అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేకుండా ఎవరో రాసి ఇచ్చిన చీటీని చదవడం తప్ప సొంతంగా మాట్లాడలేని లోకేష్ మంత్రులను విమర్శించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం నేత లక్ష్మీపతి రాజు, బీసీ సెల్ నేత ఏలుమలై ఆలియాస్ అ మ్ములు, నింద్ర జెడ్పీటీసీ సభ్యుడు పరంధామ, పుత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రతాప్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, తులసీరామిరెడ్డి పాల్గొన్నారు.

అమర జవాన్లకు మాజీ సైనికుల నివాళి



నివాళులు అర్పిస్తున్న మాజీ సైనికులు

తిరుపతి కల్చరల్ / అలిపిరి : జమ్మూ కాశ్మీర్‌లోని పూల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో భారత సైనికులు అమరులై నేటికి నాలుగేళ్లు కావడాన్ని పురస్కరించుకుని విశ్రాంత సైనికులు కపిలతీర్థం వద్దనున్న అమర జవాన్ స్థూపం వద్ద మంగళవారం జోహార్లతో నివాళులు అర్పించారు. విశ్రాంత సైనికులు ద్వారకనాథ్‌రెడ్డి, ఎంఆర్‌రెడ్డి, కేసీరెడ్డి మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలు నాలుగేళ్ల క్రితం ఇదే రోజున జరిపిన దాడిలో 40 మంది భారత సైనికులు అమరులయ్యారని, వారి అత్యున్నత త్యాగాన్ని ఎన్నటికీ మరువలేమని గుర్తు చేసుకున్నారు. విశ్రాంత సైనికులు గోపాల్, ఆనందరెడ్డి, వెంకట్, జగన అశో క్, బ్రహ్మానందస్వామి, రాజేంద్రనాయుడు, హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, జయంత్‌కుమార్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు కూడా వీర జవాన్లకు నివాళులర్పించారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుమలకు వెళుతున్న 11 మందికి రూ.22వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ఈనెల 5, 12 తేదీల్లో ద్విచక్రవాహనం, ఫోర్‌వీలర్స్‌లో డ్రైవర్లు మ ద్యం తాగి వాహనాలను నడుపుతుండగా తిరుమల ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ రామచంద్రానాయక్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 11 మందికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

తిరుపతి రూరల్ : ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతిలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంపాదనలో కొంత మొత్తం పొదుపు చేసుకోవాలని సూచించారు. అధిక వడ్డీలకు రుణం తీసుకుని ఇబ్బందులు పడవద్దని కోరారు. లోన్లు, డిపాజిట్లపై ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని చెప్పారు. మన రక్షణకు మంచి ఆర్థిక ప్రవర్తన నినాదంతో వారం రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్.సుభాష్, ఆర్బీఐ జిల్లా అధికారి పూర్ణిమ పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ఆఫ్ ఎస్వీఎంసీ అసోసియేషన్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల అభివృద్ధిలో భాగంగా ఫ్రెండ్స్ ఆఫ్ ఎస్వీఎంసీ అసోసియేషన్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థుల అసౌకర్యాలను గుర్తించి కావాల్సిన తోడ్పాటు అందించడానికి ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో కళాశాలలో పని చేసిన పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది, కళాశాలకు సంబంధం లేని వ్యక్తుల ద్వారా తోడ్పాటును అందిస్తామన్నారు. మొట్ట మొదటిగా ఐదు లక్షల విలువచేసే ఆడియో డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభానికి కొందరు పూర్వ వైద్యలు ముందుకు రావడం హర్షణీయమని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, రిటైర్డ్ రుయా సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణ ప్రశాంతి, డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, డాక్టర్ కిషోర్ కుమార్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ (అడ్మిన్), వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర దేవి(అకడమిక్), మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ మునీశ్వర్ రెడ్డి, డాక్టర్ ఫహీమ్, సీనియర్ అసిస్టెంట్ ముని కేశవులు, పీఆర్‌వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి స్పెషల్ బస్సులు



మాట్లాడుతున్న డీఎం బాలాజీ

తిరుపతి అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని తిరుపతి డిపో నుంచి పలు ఆలయాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయానికి, నరస్సరావుపేటలోని కోటప్పకొండకు, శ్రీశైలం, సదాశివకోన, కైలాసగిరి కోన, గుడిమల్లం,పెంచలకోనకు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు మాట్లాడుతూ పాత చార్జీలనే అమలు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతి బస్టాండ్ నుంచి 10 బస్సు లను కపిలతీర్థం వరకు నడపనున్నట్లు తెలిపారు.